హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మోండా డివిజన్‌లో చేపట్టిన ప్రచారంలో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్

రెజిమెంటల్‌బజార్, మే 1(ఆంధ్రజ్యోతి): ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు కోసం ఆయనతో కలిసి మోండా డివిజన్ సజ్జన్‌లాల్ స్ట్రీట్, పాట్ మార్కెట్, ఆదయ్యనగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం 100రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి 5 నెలలు అయినా అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి పోటీ చేసే అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇచ్చి పోటీలో నిలిపారని అన్నారు. పద్మారావు గెలుపు ఖాయమని తలసాని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రైలాబ్ యాదవ్, దర్మేందర్ యాదవ్, రామేశ్వర్ గౌడ్, నాగులు, హరిక్రిష్ణ, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మారావు గౌడ్‌ను గెలిపించాలి

సనత్‌నగర్: పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీశివాజీ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అమీర్‌పేట: పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని బుధవారం డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ ప్రచారం చేపట్టారు.

ఖైరతాబాద్: పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఖైరతాబాద్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



ఖైరతాబాద్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి, యూత్ కాంగ్రెస్ నేతలు



అభివాదంచేస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కాంగ్రెస్ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్, సీపీఎం, కాంగ్రెస్ నేతలు

దానం గెలుపునకు కృషి చేస్తాం

రాంనగర్, మే 1(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు కృషి చేస్తామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. బుధవారం గోల్కొండ చౌరస్తాలో సీపీఎం నగర కార్యాలయంలో దానం నాగేందర్‌కు మద్దతుగా సంఘీభావ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీవీ రాఘవులు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉన్నందున దేశంలోని అన్ని వర్గాల ప్రజలు మోదీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సీపీఎం తన వంతు పాత్ర పోషిస్తుందని, అందులో భాగంగానే దానం నాగేందర్‌కు మద్దతు తెలుపుతుందని చెప్పారు. దానం నాగేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు ప్రకటించడం శుభపరిణామన్నారు. సీపీఎం ఎన్నో సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల హక్కులను కాపాడుతోందని కొనియాడారు. సీపీఎం తనకు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించడంతో తన విజయం ఖాయమైందన్నారు.

'దానంకు మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు'

దానం నాగేందర్‌కు మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు ఇస్తున్నట్లు జేఏసీ ఛైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య తెలిపారు. బుధవారం అడిక్‌మెట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించాలన్నా, ఎస్సీ ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కొనసాగాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి దానం నాగేందర్‌ను గెలిపించాలన్నారు. సమావేశంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ ఛైర్మన్‌లు రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఖైరతాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని ఖైరతాబాద్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఖైరతాబాద్ మార్కెట్ రోడ్డులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహిచారు. దేశంలో రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరారు. ఇందులో యువజన కాంగ్రెష్ అధ్యక్షుడు మంత్రి సచ్‌దేవ్ తదితరులు ఉన్నారు.



రెహ్మత్‌నగర్ సమావేశంలో మాట్లాడుతున్న సూరి

బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా సినీయర్ కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగ రావు బుధవారం ఫిలింనగర్ బస్తీల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, కాటూరి రమేష్, ఆకుల రాజు, సంపంగి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు బండ్ల సూరి అన్నారు. బుధవారం రాత్రి రహ్మత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన డివిజన్ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దానం నాగేందర్‌ను గెలిపిస్తే నగరం అభివృద్ధి చెందుతుందని, సుస్థిర పాలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి భవానీశంకర్, నగర నాయకులు అరవింద్, స్థానిక నాయకులు గ్యార నాగరాజు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వామి, జాఫర్‌హుస్సేన్, దవీందర్‌రెడ్డి, మేఘనా పద్మ, సువర్ణ, పర్వీన్‌బేగం, కేశవులు, రాంబాబు, సాయి, అరుణ్‌గౌడ్, దేవేందర్, సతీష్ పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా అడ్డగుట్ట తుకారాంగేట్‌లో ఆటో నడుపుతున్న దానం నాగేందర్

● పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలంటూ రెహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. బుధవారం డివిజన్‌లోని చేపట్టిన ప్రచారంలో భాగంగా సీఎన్ రెడ్డి, నాయకుడు ఉపేందర్ రెడ్డి టైర్ పంచర్ వేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య

బంజారాహిల్స్, మే 1(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పంజాగుట్ట దోభిఘాట్‌కు చెందిన రెవల్లి కిష్టయ్య, ఎల్లమ్మ భార్యాభర్తలు. వీరికి వికలాంగురాలైన కుమార్తె ఉంది. కుమార్తె పెళ్లి విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరిగేది. గతనెల 30న కిష్టయ్య మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరిగింది. ఆగ్రహంతో తాడు తీసుకొని బయటకు వెళ్లిన కిష్టయ్య తిరిగి ఇంటికి రాలేదు. అన్ని చోట్ల వెతకగా సమీపంలో ఉన్న పంజాగుట్ట శ్మశాన వాటికలో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ప్రేమికుడి ఆత్మహత్య

ఖైరతాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రేమికుల మధ్య జరిగిన ఘర్షణతో ఓ యువకుడు అనుమానాస్పద రీతిలో ఆత్మహత్య చేసుకున్నాడు. సైఫాబాద్ ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... పుప్పాలగుడకు చెందిన సుమిత్ సింగ్(22) నగరానికి చెందిన ఓ యువతి సంవత్సర కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ మంగళవారం సాయంత్రం లక్డీకాపూల్‌లోని ఓ ఓయో హోటల్‌లో గది అద్దెకు తీసుకున్నారు. వీరి మధ్య ఘర్షణ జరిగినట్టు తెలుస్తోంది. యువతి వాష్ రూంకు వెళ్లొచ్చేసరికి గదిలో సుమిత్ సింగ్ చున్నీతో ఉరి వేసుకోవడం గమనించి, వెంటనే చున్నీని కట్ చేసి ప్రయత్నించినా అప్పటికే అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హోటల్ సిబ్బందికి తెలిపింది. వారి ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతి చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేయర్‌ను కలవాలంటూ ఇంట్లోకి చొరబాటు

బంజారాహిల్స్, మే 1(ఆంధ్రజ్యోతి): మేయర్‌ను కలవాలంటూ అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి హంగామా సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదు అయింది. గత నెల 30న మేయర్ ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె ఇంట్లోకి చొరబడ్డాడు. అక్కడే ఉన్న పనివారు ఆపగా తాను మేయర్‌ను కలవాలంటూ హంగామా సృష్టించాడు. వెంటనే ఇంట్లో పనివారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా అతను లక్ష్మణ్ అని ముంబాయి నుంచి వచ్చినట్టు తేలింది. లక్ష్మణ్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పోలీస్‌పై పీడీయాక్ట్

మోతినగర్, మే 1(ఆంధ్రజ్యోతి): నకిలీ పోలీస్ గుర్తింపు కార్డు సృష్టించి వరస నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ బుధవారం పీడీయాక్ట్ నమోదు చేశారు. మాదాపూర్ సీఐ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమవరం జిల్లా వీరవాసరం మండలం చిలకాల గ్రామానికి చెందిన నాగరాజు రఘువర్మ అలియాస్ కార్తీక్ అలియాస్ వరుణ్ అలియాస్ కాలోనియల్ అలియాస్ కార్తికేయ సింగ్(25)అనే యువకుడు ఓ ప్రైవేట్ సంస్థలో రికవరీ ఏజెంటు. నేరాలు చేసి డబ్బులు సంపాదించడం ప్రవృత్తిగా పెట్టుకున్న ఇతను నకిలీ పోలీస్ గుర్తింపు కార్డు తయారు చేసుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడ్డాడు. ఇటీవల సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమంగా ఆయుధాలు కలిగి కాల్పులు జరిపి పలువురిని కిడ్నాప్ చేశాడు. దీంతో సదురు నేరస్థుడు తరచూ నేరాలకు పాల్పడడంతో పాటు ప్రజా జీవనానికి, భద్రతకు ముప్పు కలిగిస్తున్నాడని భావించి అతడిపై ఉన్న 9 కేసులు దృష్టిలో ఉంచుకొని పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ప్రస్తుతం ముద్దాయి చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

విశ్రాంత ఐఏఎస్‌ను మోసం చేసిన సైబర్‌నేరగాళ్లు

బంజారాహిల్స్, మే 1(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐఏఎస్ ప్రమేయం లేకుండా ఓటీపీ, తరువాత బ్యాంకు ఖాతాలో నుంచి రెండు దఫాలుగా రూ. 24వేలు డ్రా చేశారు సైబర్ నేరగాళ్లు. ప్రశాసన్‌నగర్‌కు చెందిన ఆర్ఎస్ గోయల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సేవలందించి పదవీ విరమణ పొందారు. గత నెల 10న ఆయన ఫోన్‌కు ఓటీపీ వచ్చింది. ఆ వెంటనే రెండు దఫాలుగా రూ. 24వేలు డ్రా అయ్యాయి. వెంటనే ఆయన ఎస్‌బీఐ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లి ఖాతాను స్థంభింపజేశారు. విచారణలో దనబాద్‌లోని ఓ వ్యక్తికి డబ్బు వెళ్లినట్టు తేలింది. ఇదే విషయాన్ని ఆయన జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రోస్టేషన్ వద్ద పార్క్ చేసిన బైక్ చోరీ

యూసుఫ్‌గూడ, మే 1(ఆంధ్రజ్యోతి): మెట్రో స్టేషన్ వద్ద పార్క్ చేసిన బైక్ చోరీకి గురయింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రెహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన చల్లా సాయికృష్ణ బ్యాంక్ ఉద్యోగి. గతనెల 27న ఉదయం 6గంటలకు తన ద్విచక్రవాహనాన్ని ఎస్ఆర్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద పార్క్ చేసి పని నిమిత్తం వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం 10 గంటలకు వచ్చి చూడగా తన వాహనం కనిపించలేదు. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మాట్లాడుదామని పిలిచి దాడి

యూసుఫ్‌గూడ: మాట్లాడదామని పిలిచి దాడికి పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... న్యూమలక్‌పేటకు చెందిన ఏక్ యాకూబ్ ఆటో డ్రైవర్. ఇతడికి జవహర్‌నగర్‌కు చెందిన ఆఫ్రీన్ బేగంతో 2008లో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. సంవత్సరం క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగి ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. యాకూబ్ మళ్లీ షార్జాబేగం అనే మహిళను వివాహం చేసుకున్నాడు. దీంతో అతడి మొదటి భార్య వెస్ట్‌జోన్ మహిళా పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేసింది. అనంతరం గత నెల 30వ తేదీ జవహర్ నగర్‌కు వస్తే మాట్లాడుదామని ఆసీఫ్ అనే వ్యక్తి పిలిచాడు. అక్కడకు వచ్చిన యాకూబ్‌ను యూసుఫ్, షంషాబేగం, యూనస్, అఖిల్ తదితరులు విచక్షణా రహితంగా దాడి చేశారు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

లిఫ్ట్ గొడవలో వ్యక్తిపై దాడి

యూసుఫ్‌గూడ: లిఫ్ట్‌లో చోటు చేసుకున్న గొడవ ఓ మహిళపై దాడికి దారి తీసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అంబర్‌పేటలో రిసెప్షనిస్ట్‌గా పని చేసే అంబ్రీన్ సుల్తానా గత నెల 30న డ్యూటీకి వెళ్లేందుకు బిల్డింగ్ లిఫ్ట్ ఎక్కింది. ఓవర్‌లోడ్ అయ్యింది దిగాలని ఓ మహిళ చెప్పింది. ఈవిషయంలో మాటలు జరిగాయి. అంబ్రీన్ సుల్తానా విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఉదయం గొడవ పడ్డ మహిళ మరో యువకుడితో వచ్చి దాడి చేశారు. కేకలు వేసినా సెక్యూరిటీ వారు విడిపించలేదు. బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రూ.16 లక్షల మద్యం పట్టుకున్న పోలీసులు

పేట్‌బషీరాబాద్, మే1(ఆంధ్రజ్యోతి): తనిఖీల్లో పేట్‌బషీరాబాద్ పోలీసులు రూ.16,05,120 విలువచేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. సీఐ కె.విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. అర్జున్, దాస్ ఇద్దరు దేవరాంజయల్ మద్యం డిపో నుంచి కొనుగోలు చేసి మద్యాన్ని బిల్లులో ఉన్న వాహనంలో కాకుండా మరో వాహనంలో తరలిస్తున్నారు. పేట్‌బషీరాబాద్‌లోని హై టెన్షన్ రోడ్‌లో వాహనాలను తనిఖీలు చేస్తుండగా టీఎస్08యుడి4936వాహనంలో మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బిల్లులు పరిశీలించగా వాహనం నెంబర్ తేడా ఉండడంతో 1916 లీటర్ల మద్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

'మోదీ నాయకత్వంలోనే మహిళా సాధికారత'

ఎర్రగడ్డ, మే 1(ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ నాయకత్వంలోని మహిళా సాధికారత సాధ్యపడుతుందని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి జి కిషన్ రెడ్డి సతీమణి జి కావ్యకిషన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎర్రగడ్డ కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీలో మహిళలకు బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టు కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఆమె తెలిపారు. బీజేపీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బోరబండ బస్తీల్లో చేపట్టిన పోలీసుల కవాతులో ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శేఖర్, అదనపు బలగాలు

బస్తీల్లో పోలీసుల కవాతు

యూసుఫ్‌గూడ, మే 1(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీసులు అదనపు బలగాలతో భద్రతా ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ శేఖర్ ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని మధురానగర్, బంజారానగర్, రాజ్‌నగర్, బోరబండ సైట్-1లో అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీసీ-సీ ఉప కులాలకు 5 శాతం రిజర్వేషన్ పెంచాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏఐఐసీడీ నిర్వాహకులు డాక్టర్ రెవరెండ్ సెబాస్టియన్

యూసుఫ్‌గూడ, మే 1(ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో బీసీ-సీ ఉప కులాలకు 5 శాతం రిజర్వేషన్ పెంచాలని ఆలిండియా ఇండిపెండెంట్ చర్చిస్ డయాసీసీ(ఏఐఐసీడీ) నిర్వాహకులు, ఇండియన్ బిలీవర్స్ పార్టీ(ఐబీపీ) జాతీయ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ సెబాష్టియన్ అన్నారు. బుధవారం ఏఐఐసీడీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసే కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు బీసీ-సీ వర్గానికి కేవలం 2శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం దీనిని పెంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవనున్నట్టు తెలిపారు. క్రైస్తవులకు క్రిష్టియన్ భవన్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి వి.నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... ఎన్నికల్లో దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నో చర్చిల నిర్మాణానికి సహకారం అందించారన్నారు. సమావేశంలో పాల్గొన్న పాస్టర్‌లు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను బలపరచాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని ఏడు నియోజకవర్గాలలోని చర్చిలలో తెలియజేయనున్నామన్నారు. కార్యక్రమంలో బిషప్‌లు వినోద్, రాజేంద్ర ప్రసాద్, అరు ణ్, బాలస్వామి, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, శామ్యూల్ రెడ్డి, కళ్యాణ్‌దా స్‌తో పాటు అనేక చర్చిల పాస్టర్‌లు పాల్గొన్నారు.

పొగాకు పంటను, ఉత్పత్తుల వాడకాన్ని నిషేధించాలి



పొగాకు వ్యతిరేక ఉద్యమం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ జయలత, డాక్టర్ నాగేశ్వరరావు, దైవజ్ఞశర్మ

పంజాగుట్ట, మే 1(ఆంధ్రజ్యోతి): పొగాకులో ఎన్నో విష పదార్థాలు ఉంటాయని, పొగాకు పంటను, ఉత్పత్తుల వాడకాన్ని నిషేదించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. 50 శాతం మంది పొగాకు ఉత్పత్తులు వాడడంవల్ల చనిపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్, డాక్టర్ ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, సాయం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 31 వరకు నెల రోజుల పాటు పొగాకు వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టనున్నట్టు ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఓ.నాగేశ్వరరావు తెలిపారు. నెల రోజుల పాటు పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పొగాకు వ్యతిరేక ఉద్యమం కరపత్రాన్ని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.జయలత, దైవజ్ఞశర్మ, మహేశ్వర మెడికల్ కళాశాల ఆర్ఎంఓ డాక్టర్ సీహెచ్ మృత్యుంజయ రావు, డాక్టర్ ఐ.చిట్టిబాబు, సినీ సంగీత దర్శకుడు బి.మోహన్, సాయం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుధీర్, ట్రస్ట్ సమన్వయకర్త కుసుమ భోగరాజులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించుకుంటాం



మాట్లాడుతున్న సూర్యారావు

పంజాగుట్ట, మే 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో ఉన్న బీసీ అభ్యర్థులను పార్టీలకు అతీతంగా గెలిపించుకొని పార్లమెంటుకు పంపేలా ప్రత్యేక కార్యాచరణ ద్వారా ముందుకెళ్తున్నట్టు బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు అన్నారు. బుధవారం బీసీ సమాజ్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా రోజులుగా తెలంగాణలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సంస్థ ఆధ్వర్యంలో కుల, ప్రజా సంఘాల ద్వారా 'మన ఓటు మనమే వేసుకుందాం' అనే ఒక నినాదంతో ముందుకెళ్తూ పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన బీసీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న ఈటల రాజేందర్(మల్కాజిగిరి),బండి సంజయ్(కరీంనగర్), బూర నర్సయ్య గౌడ్(భువనగిరి), ధర్మపురి అరవింద్(నిజామాబాద్), నీలం మధు ముదిరాజ్(మెదక్), కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్(చేవెళ్ల), పద్మారావు గౌడ్(సికింద్రాబాద్), గడ్డం శ్రీనివాస్ యాదవ్(హైదరాబాద్)కు బీసీ సమాజ్ మద్దతు తెలుపుతున్నట్టు ఆయన ప్రకటించారు. ఈసమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మోడాల శ్రీనివాస్ సాగర్, నాయకులు నల్లతీగల రాజు, విజయ్ కుమార్, సావంత్ గిరి మందుల, తదితరులు పాల్గొన్నారు.

గట్కా క్రీడకు ప్రాధాన్యం కల్పించాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సర్దార్ హర్జీత్ సింగ్, సర్దార్ సుఖ్దేవ్ సింగ్

పంజాగుట్ట, మే 1(ఆంధ్రజ్యోతి): ఐదు వందల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న సిక్కుల ప్రాచీన యుద్ధ కళ గట్కా క్రీడకు తగిన ప్రాధాన్యం కల్పించాలని వరల్డ్ గట్కా ఫెడరేషన్, నేషనల్ గట్కా అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సర్దార్ హర్జీత్ సింగ్ గ్రేవాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు సర్ధార్ సుఖ్దేవ్ సింగ్, ప్రధాన కార్యదర్శి సర్ధార్ విశాల్ సింగ్, తదితరులతో కలిసి గట్కా క్రీడ నిబంధనలు, ఆట ఎలా ఆడుతారు, తదితర వివరాలతో ఉన్న బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. సిక్కు సంస్కృతిలో భాగమైన యుద్ధ విద్య గట్కా అని అన్నారు. ఈ విద్యకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని తెలిపారు. అంతరించిపోతున్న అద్భుత విద్యను నేటి యువతకు పరిచయం చేసే లక్ష్యంతో తాము కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా ఖేలో ఇండియాలో భాగంగా జాతీయ క్రీడల జాబితాలో చేర్చారని చెప్పారు. ఒలంపిక్ క్రీడల్లో సైతం ఈ క్రీడను చేర్చే అవకాశం ఉందన్నారు. ఎవరైనా నేర్చుకోవడానికి ముందుకొస్తే ఉచితంగా నేర్పిస్తామన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు సర్ధార్ గుర్విందర్ పాల్ సింగ్, సర్ధార్ హర్మేష్ సింగ్, సర్ధార్ స్వరణ్ సింగ్, గుర్విందర్ సింగ్, నానక్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ హ్యుమానిటీస్ డీన్‌గా ప్రభాకర్‌రావు

రాయదుర్గం, మే 1(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని హెచ్‌సియూ మానవీయ శాస్త్రాల విభాగం నూతన డీన్‌గా ఆచార్య జంధ్యాల ప్రభాకర్ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లుగా డీన్‌గా ఆచార్య వి.కృష్ణ నుంచి బాధ్యతలు అందుకున్నారు. ఆచార్య వి.కృష్ణ డీన్ తన మూడేళ్ల కాలంలో నూతన అధ్యాపకుల రిక్రూమెంట్‌లోను, పదోన్నతులు కల్పించడంలోను చురుకైన పాత్ర నిర్వహించారని వివిధ శాఖల అధ్యక్షులు, ఆచార్యులు ప్రసంశించారు. తనకు సహకరించిన అందరిని కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య మురళీ మనోహర్, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య సీహెచ్, అన్నపూర్ణ, అచార్య లంబా కులకర్ణి, ఆచార్య అరుణ్‌మోజి, ఆచార్య షమ్మి, పవన్‌కుమార్, ఆచార్య లక్ష్మీనారాయణ, ఆచార్య పిల్లల మర్రి రాములతో పాటు పలువురు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన

నిజాంపేట్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో జన విజ్ఞాన వేదిక లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పొలిస్టిక్ ఆస్పత్రి డాక్టర్ సూర్యతేజ ఆధ్వర్యంలో గుండెపోటు వస్తే ప్రాథమిక చికిత్సపై విద్యార్థులకు, పెద్దలకు అవగాహ న బుధవారం కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలు అడిగిన పలు ప్రశ్నలకు సూర్యతేజ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య భవణ నిర్వహణ కమిటీ కన్వీనర్ చారి, ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

జర్నలిజం గౌరవాన్ని మరింత పెంచాలి

● గవర్నర్ రాధాకృష్ణన్

హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిజం ఉన్నతమైనదని, దాని గౌరవాన్ని మరింత పెంచే దిశగా రాణించాలని రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ సూచించారు. బుధవారం జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(జేఏటీ) రాష్ట్ర ప్రతినిధి బృందం రాజ్‌భవన్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఉగాది పండగను పురస్కరించుకొని రూపొందించిన జర్నలిస్టు డైరీని అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జర్నలిస్టు ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పగుడాకుల బాలస్వామి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ లక్ష్మీకాంత్, రాష్ట్ర సహకార్యదర్శులు ప్రవీణ్, కుమార్, నగర అధ్యక్షుడు చిలుకూరి అఖిలేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, నగర ప్రధాన కార్యదర్శి అనిల్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ సత్యం, రాష్ట్ర నాయకులు సిద్ధయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా మేడే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప



హెచ్ఎండీఏ పరిధిలో జెండాను ఆవిష్కరిస్తున్న బీపీపీఏ కార్మికులు



ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన మేడే వేడుకల్లో సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి, పరుచూరి గోపాలకృష్ణ, సినీ నటుడు శ్రీకాంత్ తదితరులు - బంజారాహిల్స్, మే 1(ఆంధ్రజ్యోతి)

సనత్‌నగర్, మే 1(ఆంధ్రజ్యోతి): నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు బుధవారం మేడే ఘనంగా నిర్వహించారు. నిమ్స్‌లో యూనియన్ బ్యాంకు వద్ద సభ నిర్వహించి, గేటు వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సభకు సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆస్పత్రి డైరెక్టర్ నగరి బీరప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్మికుల రక్తంతో తడిసినదే ఎర్రజెండా అని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే దేశంతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం 8 గంటల పని దినంతో పాటు, మరి కొన్ని హక్కులు సాధించుకుందన్నారు. నిమ్స్ కార్మికులకు, సిబ్బందికి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన సదుపాయాలు అందేలా కృషి చేస్తామన్నారు. నర్సెస్ యూనియన్ అధ్యక్షురాలు ఆషాలత, ప్రధాన కార్యదర్శి విజయకుమారి లు, యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేష్ ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహులు నర్సెస్ యూనియన్ అధ్యక్షురాలు ఆశాలత, ప్రధాన కార్యదర్శి విజయ కుమారి పాల్గొన్నారు.

హైదరాబాద్ సిటీ: హెచ్ఎండీఏలోని బుద్ధ పూర్ణిమా ప్రాజెక్టు అథారిటీ (బీపీపీఏ) పరిధిలోని లుంబినీ, సంజీవయ్య పార్కు, ఎన్టీఆర్ గార్డెన్, నెక్లెస్ రోడ్డులో పనిచేసే కార్మికులు బుధవారం మేడే వేడుకలను జరుపుకొన్నారు. సంజీవయ్య పార్కు వద్ద మహిళా కార్మికురాలు జెండావిష్కరణ చేశారు. సీఐటీయూ నేత కుమారస్వామి మాట్లాడుతూ... ప్రపంచ కార్మికులను ఐక్యం చేసేదే మేడే అని అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటితంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్యురిటీ సిబ్బంది, హౌస్ కీపింగ్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎర్రగడ్డ: ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో మానసిక ఆస్పత్రి వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి రాపర్తి అశోక్ మాట్లాడారు. కొంతమంది మేథావుల పోరాటంవల్లే 8 గంటల పని దినం పరిమితమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జోన్ నాయకులు భిక్షపతి, మానసిక ఆస్పత్రి యూనియన్ ఉపాధ్యక్షుడు ఎస్ ఓం ప్రకాష్, శ్రీధర్, తిరుపతిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఐకమత్యంతో హక్కులను సాధించుకోవాలి'

బంజారాహిల్స్, మే 1(ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతో ఏదైనా సాధించొచ్చని పలుమార్లు కార్మికులు నిరూపించారని సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ అన్నారు. మేడే సందర్భంగా బుధవారం ఫిలిం ఫెడరేషన్ కార్యాలయం వద్ద ఆయన ఫిలిం ఫెడరేషన్, సినీ యూనియన్ల కార్మిక నేతలతో కలిసి మేడే జెండాను ఎగుర వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రమ దోపిడీకి గురవుతున్న తరుణంలో కార్మికుల పోరాటంతోనే 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. మనలో మనకు ఎన్ని గొడవలున్నా సందర్భం వచ్చినప్పుడు కార్మికులంతా కలిసి కట్టుగా ఉండి పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్, సెక్రటరి పీఎస్ఎన్ దొర, కోశాధికారి సురేష్, డైరెక్టర్ వీర శంకర్, వివిధ యూనియన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

దానం గెలుపునకు కృషి చేస్తాం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు కృషి చేస్తామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. బుధవారం గోల్కొండ చౌరస్తాలో సీపీఎం నగర కార్యాలయంలో దానం నాగేందర్‌కు మద్దతుగా సంఘీభావ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీవి రాఘవులు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉన్నందున దేశంలోని అన్ని వర్గాల ప్రజలు నియంత మోదీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో సెక్యూలర్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సీపీఎం తనవంతు పాత్ర పోషిస్తుందని, అందులో భాగంగానే దానం నాగేందర్‌కు మద్దతు తెలుపుతుందని చెప్పారు. ప్రధాని మోదీ తన స్థాయికి తగ్గట్లుగా వ్యవహరించడం లేదని, మంగళ సూత్రాలు లాక్కొని ముస్లింలకు పంచి పెడతారని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ పాలించిందని, ఎంత మంది మహిళల మంగళ సూత్రాలు ఇప్పటివరకు లాగేసుకున్నారో మోదీ చెప్పాలన్నారు. దానం శక్తి సామర్థ్యాలు గల నాయకుడని, ప్రజలకు అందుబాటులో ఉండే నేతని అలాంటి వ్యక్తిని పార్లమెంట్‌కు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. దానం నాగేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు ప్రకటించడం శుభపరిణామమన్నారు. సీపీఎం ఎన్నో సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల హక్కులను కాపాడుతోందని కొనియాడారు. సీపీఎం తనకు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించడంతో తన విజయం ఖాయమైందన్నారు.


అభివాదంచేస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కాంగ్రెస్ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్, సీపీఎం, కాంగ్రెస్ నేతలు


ఎన్నికల ప్రచారంలో భాగంగా తుకారాంగేట్‌లో ఆటో నడుపుతున్న దానం నాగేందర్

దానం గెలుపునకు అంకితభావంతో పనిచేయండి

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణిరెడ్డి సూచించారు. బుధవారం బాగ్‌అంబర్‌పేటలో మాజీ ఎంపీ హనుమంతరావు నివాసంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోహిణిరెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసేలా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు.

దానంకు మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు

దానం నాగేందర్‌కు మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు ఇస్తున్నట్లు జేఏసీ చైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తెలిపారు. బుధవారం అడిక్‌మెట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కొనసాగాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మాలలు, దళిత బహుజనులందరూ దానంను గెలిపించాలని జేఏసీ ప్రచారం చేస్తుందని తెలిపారు.

గాంధీనగర్‌లో 15 వేల ఓట్ల మెజారిటీ సాధిస్తాం

చిక్కడపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు గాంధీనగర్ డివిజన్‌లో 15 వేల ఓట్ల మెజారిటీ సాధిస్తామని డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్న అన్నారు. బుధవారం సాయంత్రం డివిజన్‌లోని 46 బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దానంను గెలిపించాలని కోరుతూ గురువారం నుంచి డివిజన్‌లో పాదయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు.

దానంను గెలిపించండి : విజయారెడ్డి

ఖైరతాబాద్: దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి ఖైరతాబాద్‌లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సచ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● తలసాని ఇంటింటి ప్రచారం


కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావుగౌడ్


సవరాలబస్తీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

రెజిమెంటల్‌బజార్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నేరవేర్చడంలో విఫలం అయ్యిందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు కోసం ఆయనతో కలిసి మోండా డివిజన్ సజ్జన్‌లాల్ స్ట్రీట్, పాట్ మార్కెట్, ఆదయ్యనగర్ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి 5నెలలు అయినా అమలు చేయడంలేదన్నారు. ఏ ముఖంతో వారిని ఓట్లు అడుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు స్కైలాబ్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, రామేశ్వర్ గౌడ్, నాగులు, హరిక్రిష్ణ, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్ : బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఆవులమంద, కలాసిగూడ బస్తీలలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ళ పద్మారావుగౌడ్‌కు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.

ముషీరాబాద్ : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఎమ్మెల్యేముఠాగోపాల్ బుధవారం బాకారం, బ్యాంక్ ఆఫ్ బరోడా కాలనీ, మహాత్మానగర్, దేవిచౌక్ వీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సనత్‌నగర్ : సనత్‌నగర్ నియోజకవర్గ మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను ఓటు వేసి గెలిపించవలసిందిగా సనత్‌నగర్ కార్పొరేటర్ కొలనులక్ష్మి శివాజీనగర్‌లో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు




పద్మారావునగర్‌లోని సర్దార్‌పటేల్ కళాశాల వార్షికోత్సవాన్ని నాంపల్లిలోని మైదానంలో నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి

బడుగు బలహీనవర్గాలకు అండగా ఉంటా

● బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల

మచ్చబొల్లారం, మే, 1 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటానని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటేల రాజేందర్ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని వీబీఆర్ గార్డెన్‌లో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఈటల హాజరై మాట్లాడారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్‌గా పేరుగాంచిన మల్కాజిగిరిలో ఈసారి బీజేపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

మల్కాజిగిరి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అనంతరం ఎస్సీ మోర్చా నాయకులు ఈటెలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీమోర్చా ప్రధానకార్యదర్శి క్రాంతికిరణ్, మేడ్చల్ జిల్లా ఎస్సీమోర్చా నాయకుడు మురళి, కరుణాకర్, లవ్‌కుమార్, నాగరాజు, రమేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


మచ్చబొల్లారం వీబీఆర్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్

మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి ప్రచారం

రామంతాపూర్ : హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో బుధవారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బీజేపీ స్టిక్కర్‌లను గోడలపై అతికించి, కరపత్రాలను పంపిణీ చేసి, కమలం గుర్తుపై ఓటును వేసి ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వప్నారెడ్డి, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ స్టిక్కర్‌ను గోడకు అతికిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

● కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రామంతాపూర్ డివిజన్ పరిధిలోని 254, 255, 256 బూత్‌ల అధ్యక్షులు, కోఆర్డినేటర్లు రేవు నరసింహ కురుమ, బుర్ర రాజేశ్వర్, బొడ్డుపల్లి ఆనంద్, గుండె భిక్షపతిల ఆధ్వర్యంలో పాత రామంతాపూర్‌లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ దేశంలో నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి ఓటర్లకు వివరించి మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ బీజేపీ అధ్యక్షులు బండారు వెంకటరావు, ముత్తినేని జగదీష్, గడ్డం సాయికిరణ్, వళ్ళపు జగన్‌యాదవ్, నందకిషోర్ యాదవ్, వెంకట్‌రెడ్డి, మహేందర్, నాగేష్, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ : మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని శ్రీరాంనగర్‌కాలనీ, ప్రగతినగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్‌కాలనీలలో బుధవారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడే శక్తి గల వ్యక్తి ఈటల అన్నారు. ప్రతి ఒక్కరూ ఈటలను గెలిపించడానికి కృషి చేయాలన్నారు.


బీజేపీ కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

యువకుడికి ఏడురోజుల జైలుశిక్ష

బౌద్ధనగర్, మే1 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో ప్రజాజీవనానికి ఆటంకం కలిగించిన ఓ యువకుడి ఏడురోజుల జైలుశిక్ష పడిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన ప్రకారం ముషీరాబాద్ పటాన్‌బస్తీకి చెందిన మహ్మద్ జాకీర్ అలియాస్ నషీరుద్దీన్ సోమవారం రాత్రి స్థానికంగా మద్యం సేవించి హంగామా చేసి స్థానికులపై దాడికి పాల్పడ్డాడు. స్థానికులు ఫిర్యాదు మేరకు జాకీర్‌పై పోలీసులు ఈ-పెట్టి కేసును నమోదు చేసి బుధవారం ఉదయం సికింద్రాబాద్ స్పెషల్ పదిహేనవ మెట్రోపాలిటన్ కోర్టులో మేజిస్ట్రేట్ కె.రవిశంకర్ ముందు హాజరు పర్చారు. నిందితుడికి ఏడురోజుల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.


మహ్మద్ జాకీర్

చిలకలగూడలో పోలీస్ స్టేషన్ పరిధిలో..

మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు వ్యక్తులకు రెండురోజుల పాటు జైలుశిక్ష పడిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం చిలకలగూడకు చెందిన బి.కరుణాకర్(35), పార్శిగుట్టకు చెందిన ఎన్.శివ(26), పి.రాములు(26)లు సోమవారం రాత్రి స్థానికంగా మద్యం సేవించి హంగామ చేస్తూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురి వ్యక్తులపై ఈ-పెట్టి కేసును నమోదు చేసి బుధవారం ఉదయం సికింద్రాబాద్ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో మేజిస్ట్రేట్ కె.రవిశంకర్ ముందు హాజరుపర్చారు. నిందితుల ముగ్గురికి రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ముగ్గురిని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అడ్డగుట్ట, మే 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని గోపాలపురం పోలీసులు మార్చురీకి తరలించారు. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ మెట్రో పిల్లర్ 960 వద్ద గుర్తుతెలియని 60 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అడ్డగుట్టలో..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా సుభాష్ విగ్రహం వద్ద గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సికింద్రాబాద్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

అడ్డగుట్ట, మే 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో గుర్తుతెలియని వృద్ధుడు చనిపోయి ఉన్నాడని సమాచారం తెలుసుకున్న గోపాలపురం పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురికి తరలించారు. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ ఆర్ఆర్ క్వార్టర్ స్వికార్ ఆస్పత్రి వద్ద గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉన్నాడనిసమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

బౌద్ధనగర్, మే 1(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌కు బెదిరింపు స్పామ్ కాల్స్ రావటంతో ఓ యువకుడు ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం వారాసిగూడ షాబాద్‌గూడకు చెందిన ఎండీ సమీర్(23) చిలకలగూడలో ఓ బట్టల దుకాణంలో పని చేస్తున్నాడు. రెండు రోజుల నుంచి సమీర్ మొబైల్‌కు బెదిరింపు స్పామ్ కాల్స్ వస్తున్నాయి. దీంతో భయాభ్రాంతులకు గురైన సమీర్ మంగళవారం రాత్రి 8:30 నిమిషాల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

తండ్రి తనకుమారుడు కోసం స్నేహితుల వద్ద ఆరా తీయగా సమీర్‌కు రెండురోజుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తెలిపారు. దీంతో తనకుమారుడు కనిపించటంలేదని తండ్రి మహ్మద్ ఖలీమ్ బుధవారం వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఎండీ సమీర్

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి


రోడ్‌షోలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభీపూర్ రాజు తదితరులు


మాజీఎమ్మెల్యే కనకారెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి

ఓల్డ్ బోయినపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): వందరోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని గద్దెనెక్కిందని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం సాయంతం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లో చేపట్టిన రోడ్‌షోలో ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభీపూర్ రాజుతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మయాదవ్ చేసిన ప్రసంగం డివిజన్ ప్రజలను ఉర్రూతలూగించింది. సీనియర్ నాయకులు నరేందర్ గౌడ్, కర్రెజంగయ్య, ఇర్ఫాన్ పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మచ్చబొల్లారం : మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజలు ఇప్పటికీ బీఆర్‌ఎస్‌వైపే ఉన్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎంటీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, రావుల అంజయ్య, డోలీ రమేశ్, పరమేశ్, రాజేశ్, లక్ష్మణ్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కూకట్‌పల్లి రామయ్యనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



మండుతున్న ఎండలో డ్యూటీచేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు చల్లని షర్బత్ అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగయ్య

ఎండ నుంచి ఉపశమనం కోసం ట్రాఫిక్ పోలీసులకు షర్బత్

బోయినపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎండలు మండిపోతున్నాయి. జనాలు మధ్యాహ్నంపూట బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రోడ్డుమీద పదినిమిషాలు నిలబడలేని పరిస్థితి కనబడుతుంది. అలాంటిది ఎండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యూటీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. మండుతున్న ఎండలో డ్యూటీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు వాళ్ల ఎండ నుంచి కాస్త ఉపశమనం కల్పించడానికి బోయినపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వనమూలికలతో తయారైన షర్బత్‌ను బుధవారం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి అందజేశారు. ఈ షర్బత్ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు ప్రతిరోజు అందజేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సునీతా మహేందర్ రెడ్డి విజయానికి కృషి

సర్వేసత్యనారాయణ

మారేడుపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గ మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం తన వంతు కృషి చేస్తానని కేంద్ర మాజీ మంత్రి సర్వేసత్యనారాయణ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి భరోసా ఇచ్చారు.


కేంద్ర మాజీ మంత్రి సర్వేసత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన సునీతా మహేందర్ రెడ్డి

ఘనంగా మే డే వేడుకలు

సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో బుధవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు జెండాలను ఆవిష్కరించారు.

- సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్‌బృందం (ఆంధ్రజ్యోతి):

బోయినపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహ, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్‌లు ముఖ్యఅతిథిగా హాజరై కార్మిక జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా జంపన్న ప్రతాప్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని హామీ ఇచ్చారు. కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కార్మికుల శ్రేయస్సుకు తోడుగా ఉంటానని నరసింహ అన్నారు. ఏఐటీయూసీ నాయకులు నరసింహ, కాంగ్రెస్ నాయకులు ప్రభుగుప్తా, అరుణ్ యాదవ్, ముప్పిడి మధుకర్, మల్కాద్రి కార్మికసంఘ నాయకులు బాలకృష్ణ, అశోక్, ప్రసాద్, శేఖర్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



మేడే ర్యాలీలో పాల్గొన్న ఏఐటీయుసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, కార్మిక నాయకులు


సాజన్యకాలనీలోని బీఆర్‌ఎస్ క్యాంప్ కార్యాలయంలో మే డే వేడుకలలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, నివేదిత



ఆటో డ్రైవర్లకు సత్కారం

రెజిమెంటల్‌బజార్, మే1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుదవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రాములు, సతీష్‌లతో కలసి ఆటో డ్రైవర్లను సత్కరించారు. ఈ సందర్భంగా వారికి రోడ్డు భద్రతకు సంబంధించిన సూచనలు, సలహాలు అందించారు.


సాజన్యకాలనీలోని బీఆర్‌ఎస్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన మే డే వేడుకలలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి


ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా తుకారాంగేట్‌లోని ఎఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గౌరి, నాగరాజు, పాకాల యాదగిరిలతో పాటు పలువురు ఎఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. - అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి


అంతర్జాతీయ మే డే దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి బుధవారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో మే డే జెండాను ఆవిష్కరించి, అనంతరం కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి